ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు
జిల్లా వార్తలు

5

బుధవారం 18 జూన్ 2025



ధ్యానం చేస్తున్న మంత్రి టీజీ భరత్

యోగా... వారసత్వ సంపద

- దైనందిన జీవితంలో ఆసనాలు తప్పనిసరి
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో యోగాంధ్ర వేడుకలు





కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో యోగాలో పాల్గొన్న ప్రజలు



కర్నూలు స్పోర్ట్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వేల సంవత్సరాల నుంచి వస్తున్న యోగా మన వారసత్వ సంపద అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, మహిళలు, అధికారుల భాగస్వామ్యంతో 5 వేల మందితో నిర్వహించిన థీమాటిక్ యోగా ప్రదర్శన నిర్వహించారు. యోగా శిక్షకులు మునిస్వామి యోగాసనాలు వేయించారు. యోగా కార్యక్రమం నిర్వహణ తర్వాత మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు దాదాపు 11లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకుని కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని అభినందించారు. యోగా 5వేల సంవత్సరాల నుంచి మనకు వారసత్వంగా వస్తోందని, యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

మిగతా 6 లో...

ఆప్కో ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు

విజేతలకు నగదు బహుమతులు ప్రదానం

కర్నూలు కల్చరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆప్కో, లేపాక్షి సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు కర్నూలు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ బి.తిమ్మయ్య తెలిపారు. సంప్రదాయ హస్తకళలు, చేనేత కళలకు ఆధునిక రూపమిచ్చే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం నగరంలోని హెడ్ పోస్టాఫీసు ఎదురుగా ఉన్న లేపాక్షి సంస్థ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సంస్థ సైతం ఈ పోటీల్లో భాగస్వామిగా ఉంటోందని, చేనేత వస్త్రాల తోపాటు హస్తకళా రూపాలైన కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారీ ప్రింట్లు, లెదర్ పప్పెట్రీలు, ఉడ్ కార్వింగ్ ఉత్పత్తులు, ధర్మవరం, గద్వాల, ఉప్పాడ, మంగళగిరి తదితర వాటిపై నూతనత్వం ఉట్టిపడేలా ఉండాలని, అలాంటి వారికి ఈ డిజైనింగ్ పోటీల్లో ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు 18 ఏళ్లు పైబడి ఉండాలని తెలపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు నగదు రూపంలో అందజేస్తారని తెలిపారు. దరఖాస్తు ఫారాలను కర్నూలు హెడ్ పోస్టాఫీసు ఎదురుగా ఉన్న లేపాక్షి ఎంపోరియంలో లభిస్తాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూలై 16వ తేదీ లోగా లేపాక్షి ఎంపోరియంలో సమర్పించాలని సూచించారు.

మార్కెట్ కమిటీల సెస్సు లక్ష్యం రూ.40.40 కోట్లు

ఏడీఎం నారాయణమూర్తి



కర్నూలు అగ్రికల్చర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు మార్కెట్ కమిటీల ద్వారా 2025 సంవత్సరానికి రూ.40.40 కోట్ల సెస్సు రూపంలో ఆదాయం సాధించాలని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయ సునీత లక్ష్యాన్ని నిర్దేశించారని ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ కమిటీ నుంచి రూ.8.70 కోట్లు ఆదోని నుంచి రూ.18 కోట్లు, ఎమ్మిగనూరు నుంచి రూ.8.50 కోట్లు, ఆలూరు నుంచి రూ.1.10 కోట్లు, పత్తికొండ మార్కెట్ కమిటీ నుంచి రూ.95 లక్షలు, కోడుమూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.1.80 కోట్లు, మంత్రాలయం మార్కెట్ కమిటీ నుంచి రూ.1.35 కోట్ల సెస్సును సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏడీఎం తెలిపారు. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరగని మార్కెట్ కమిటీల పరిధిలో చెక్‌పోస్టులను బలోపేతం చేస్తున్నామని, జీరోపై పంట ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు తరలించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సెస్సు వసూళ్లలో నిర్లక్ష్యం చూపే సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యాపారుల అక్రమాలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మార్కెట్ కమిటీ యార్డుల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.

పత్తి క్వింటా రూ.7,979



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు కొద్ది రోజులుగా స్థిరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,979 పలికింది. సాధారణంగా ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న సమయంలో పత్తి ధరలు రైతులు పెరుగుతాయి. కానీ ధరలు పెరగకపోవడంతో పత్తి రైతులు నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం మార్కెట్‌కు 216 క్వింటాళ్లు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5,369, గరిష్ఠంగా రూ.7,979, సగటున రూ.7,709 పలికింది.

డీసీఎంఎస్ కేంద్రాలకు పూర్వ వైభవం

- కేంద్రాలకు పుష్కలంగా ఎరువులు
- మొదటి విడత 500 మెట్రిక్ టన్నులు



డీసీఎంఎస్ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. రైతులకు అవసరమైన ఎరువులను డీసీఎంఎస్ కేంద్రాలకు అందించలేదు. మార్క్‌ఫెడ్ సంస్థ నుంచి అందాల్సిన రూ.3 కోట్ల బకాయిలు అందకుండా చేసింది. ఫలితంగా ఐదు నెలలు ఉమ్మడి జిల్లాలోని 17 డీసీఎంఎస్ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది జీతాల్లేక పస్తులతో అలమటించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థకు పూర్వ వైభవం చేకూరింది. మార్క్‌ఫెడ్ నుంచి బకాయిలు విడుదల కావడంతో ఐదు నెలల జీతాలను ఒకేసారి అందించడంతో ఆ సంస్థ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. మరో వైపు డీసీఎంఎస్ కేంద్రాలకు ప్రస్తుత ఖరీఫ్‌లో సరిపడ ఎరువులు అందించాలని మార్క్‌ఫెడ్ సంస్థకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొదటి విడతగా ఉమ్మడి జిల్లాలోని 17 డీసీఎంఎస్ కేంద్రాలకు 500 మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు పంపామని డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో రైతులకు డీలర్లు ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువ ధర డిమాండ్ చేస్తుండటం వల్ల తీవ్ర ఇబ్బందులకు వారు గురవుతున్నారని ఆయన తెలిపారు. అదే డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఎరువులను రైతులు కొనుగోలు చేస్తే ఎంఆర్‌పీ ధరకే ఎరువులను వారికి అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ దృష్టితోనే మార్క్‌ఫెడ్ సంస్థకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఖరీఫ్‌లో రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా ఎంఆర్‌పీ ధరకే డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఎరువులు అందిస్తామని చైర్మన్ స్పష్టం చేశారు.



డీసీఎంఎస్‌ను బలోపేతం చేస్తాం

గత వైసీపీ ప్రభుత్వం జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థను నిర్వీర్యం చేసింది. అవసరమైన ఎరువులను తమ సంస్థ కేంద్రాలకు అందించకుండా సతాయించింది. దీని వల్ల రైతులు బహిరంగ మార్కెట్‌లో రైతుల నుంచి ఎంఆర్‌పీ ధర కంటే అధిక ధరను చెల్లించి కొనుగోలు చేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఎరువులే కాకుండా వివిధ పంట ఉత్పత్తుల సేకరణకు అవకాశం కల్పించింది.

- వై. నాగేశ్వరరావు యాదవ్, చైర్మన్

అన్ని ఎరువులు అందుబాటులో

ప్రస్తుతం డీసీఎంఎస్ సంస్థ కేంద్రాల్లో ఎరువుల బస్తాలతో కళకళలాడుతున్నాయి. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను మార్క్‌ఫెడ్ సంస్థ ఈ కేంద్రాలకు సప్లయ్ చేస్తుంది. ఎరువుల విక్రయం వల్ల తమకు ఒక బస్తాపై కమిషన్ ప్రభుత్వ నిబంధనల మేరకు అందుతుందని, ఈ కమిషన్ ద్వారా వచ్చే ఆదాయం వల్ల సిబ్బందికి జీతాలు అందించడంతో పాటు డీసీఎంఎస్ సంస్థ బలోపేతానికి చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

పోస్టాఫీసు కిట..కిట



నగదు డ్రా చేసుకునేందుకు క్యూలో మహిళలు



కర్నూలు న్యూసిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 'తల్లికి వందనం' పథకంలో భాగంగా తల్లుల ఖాతాల్లో నగదును జమ చేసింది. ప్రధానంగా బ్యాంకు ఖాతాతో పాటు పోస్టాఫీసు ఖాతాలో కూడా నగదు జమ చేశారు. దీంతో మంగళవారం కర్నూలు జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో తల్లులు తమ ఖాతాల్లోని నగదును డ్రా చేసుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జిల్లా వ్యాప్తంగా 3,67,614 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం రూ.477.90 కోట్లు జమ చేసింది. 2,16,181 తల్లుల ఖాతాల్లో నగదు జమ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఒక్కో ఇంట్లో ఐదుగురు పిల్లలు ఉంటే రూ.65 వేలు కూడా జమ అయింది. ప్రధానంగా మహిళలకు అత్యధికంగా పోస్టాఫీసులో ఖాతా ఉండటంతో వేలాదిగా తరలివచ్చారు. నగదు డ్రా చేసుకునే సమయంలో పోలీసులు మహిళలను నియంత్రించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగదు డ్రా చేసుకున్న అనంతరం తల్లులు పిల్లలకు బ్యాగులు, పుస్తకాలతో పాటు బంగారు, బట్టలు కొనుగోలు చేశారు.



పోస్టాఫీసు ఎదుట బారులుదీరిన జనం

262 ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు

డీఈవో శామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రైవేటు పాఠశాలలో విద్యాహక్కు చట్టం ఆర్‌టీఈ 12(1) నిబంధనల ద్వారా సీట్లు కేటాయించిన విద్యార్థులకు వివిధ కారణాలతో అడ్మిషన్లు నిరాకరించిన 262 పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆర్‌టీఈ 12(1) చట్టం కింద ఉచిత అడ్మిషన్ల కోసం 2289 మంది పేద విద్యార్థులకు లాటరీ ద్వారా సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అయితే 122 పాఠశాలలో కేవలం 1110 మంది విద్యార్థులకు మాత్రమే అడ్మిషన్లు ఇచ్చారని, మిగిలిన 262 పాఠశాలలో 1179 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వలేదని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు డిమాండ్ చేస్తూ, తల్లిదండ్రుల చిరునామాలు సరిగ్గా లేవని సాకు చూపి అడ్మిషన్లు తిరస్కరించారని కలెక్టర్‌కు, డీఈవోకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. కొందరు అడ్మిషన్ల గడువు పూర్తయిందని, సీట్లు ఇవ్వలేమని చెప్పినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. 384 పాఠశాలలకు గాను 122 పాఠశాలలు మాత్రమే అడ్మిషన్లు ఇచ్చారని, 262 పాఠశాలలో సీట్లు ఇవ్వడానికి యాజమాన్యాలు నిరాకరించినట్లు తమకు ఫిర్యాదుల వచ్చాయని తెలిపారు. ఆర్‌టీఈ చట్టం ఉల్లంఘించిన 262 పాఠశాలలకు నోటీసులు జారీ చేశామని డీఈవో తెలిపారు. సరైన కారణం చూపని పాఠశాలల యజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో జైళ్ల డీజీ అంజనీ కుమార్



మంత్రాలయంలో ప్రదిక్షణలు చేస్తున్న రాష్ట్ర జైళ్ల డీజీ అంజనీ కుమార్

మంత్రాలయం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం రాష్ట్ర జైళ్ల డైరెక్టర్ ఆఫ్ జనరల్ అంజనీ కుమార్ మంగళవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈయనకు మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సురేష్ కోణాపూర్, మంత్రాలయం సీఐ రామాంజులు, కర్నూలు జిల్లా జైళ్ల సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, ఆదోని జైలర్ నజీర్ అహ్మద్, అనంతస్వామి, పవన్ ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్ పాల్గొన్నారు.

కేఎంసీలో వైద్యుల బదిలీ

కర్నూలు హాస్పిటల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్యుల బదిలీ కౌన్సెలింగ్ ముగిసింది. ఆరుగురు ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 10 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను బదిలీ చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. ప్రొఫెసర్లలో శ్రీలక్ష్మి (గైనిక్ హెచ్‌వోడీ) అనంతపురానికి బదిలీ కాగా రాధారాణి (రేడియాలజీ) తిరుపతికి, వీరకుమార్ (ఈఎన్‌టీ) రాజమండ్రికి, పి.వెంకటరమణ బాబు (పెథాలజి) నంద్యాలకు బదిలీ అయ్యారు. అసోసియేట్ ప్రొఫెసర్లలో ఎం.మల్లికార్జున (పీడీయాట్రిక్) కడపకు, టి.ప్రశాంతి (అనాటమి) కాకినాడకు, మాధవీలత (పీజాయాలజి) అనంతపురానికి బదిలీ అయ్యారు. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లలో అనంతపురానికి డాక్టర్ మీనుగ శ్రీనివాసులు (మెడిసిన్) బదిలీ అయ్యారు. పి.స్నేహ (ఓబీజీ), పి.మమత (ఓబీజీ) తిరుపతికి బదిలీ కాగా... మన్సూర్ బాషా (సర్జరీ) మంజుల (అనస్తీషియా) అపర్ణ (అనాటమి) నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆప్తమాలజీ వైద్యులు అనురాధ, లత, బి.విద్యాసాగర్, జాన్సన్‌రాజు కుమార్ తిరుపతికి బదిలీ అయ్యారు.

బసవన్నలకూ హాలిడే!



చిన్నభోంపల్లిలో ఎద్దులతో రైతు

కోసిగి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి మనుషులకే కాదు మూగ జీవాలకూ ఉంటుందని నమ్ముతారు కోసిగి మండలంలోని చిన్నభోంపల్లి గ్రామ రైతులు. అందుకే వారు తమ ఊరిలోని బసవన్నలకూ ఓ రోజు హాలిడే ఇచ్చి, సుందరంగా అలంకరించి, పిండివంటలను తయారు చేసి ఆ బసవన్నలకు ఇష్టంగా వడ్డిస్తారు. ఎన్నో ఏళ్లగా వస్తున్న వస్తున్న ఆచారాన్ని చిన్నభోంపల్లి గ్రామస్థులు కొనసాగిస్తున్నారు. ఏరువాక సందర్భంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన ఎద్దులను పొలాలకు తీసుకెళ్లకుండా మంగళవారం తమ ఇళ్ల వద్ద ఉంచుకుని వాటికి స్నానం చేయించి సుందరంగా అలంకరించారు. ఇంటిల్లిపాది ఆ ఎద్దులను దైవంగా భావించి పూజలు నిర్వహించి పిండివంటలను వాటికి సమర్పించారు. ప్రతి రోజు కష్టపడి అలసిపోయి ఉండడంతో ప్రత్యేకంగా ఏరువాక పండగ పూర్తయిన మరుసటి రోజు బసవన్నలకు సెలవు ఇస్తామని గ్రామస్థులు తెలిపారు.

సన్నబియ్యంతో సంబరాలు

జిల్లాలో 1,382 పాఠశాలలకు 10,960 బ్యాగుల కేటాయింపు 6

సీ బిల్ గుబుల్..

జిల్లా సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు

- క్రికెట్ స్టేడియం నిర్మిస్తాం
- లక్ష్మీపురం టిడ్కో ఎదురుగా శంకుస్థాపన చేసిన మంత్రి టీజీ.భరత్ 7

యోగా... వారసత్వ సంపద




యోగా విన్యాసాలు



అవుట్‌డోర్ స్టేడియంలో...

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులు యోగా చేయడం అలవర్చుకోవాలని మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. ప్రజలకు యోగా పట్ల అవగాహన కల్పించి ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం సముద్రతీరంలో ఐదు లక్షల మందితో జరిగే యోగా కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొంటారన్నారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియం అభివృద్ధికి, అవసరమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. అందులో భాగంగా వాకింగ్ ట్రాక్ తదితర సదుపాయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రీన్‌కో ద్వారా సీఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లతో టిడ్కో గృహ సముదాయాల దగ్గర అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ స్టేడియం నిర్మించే చర్యలు తీసుకుంటున్నామనీ తెలిపారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జూన్ 21న జరిగే అంర్జాతీయ యోగా కార్యక్రమం కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో 11 లక్షల మంది కర్నూలు జిల్లా నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎన్‌సీసీ కల్నల్ ప్రసాద్, డీఎస్‌డీవో భూపతిరావు, కార్పొరేటర్ పరమేష్, ఆయూష్ డాక్టర్ ప్రసాద్, మునిస్వామి, జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, అధికారులు, కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.





21 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలోని కోర్సుల్లో ప్రవేశాల కోసం పాలిసెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 21 నుంచి జూన్ 28వ తేదీ వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ కౌన్సిలింగ్ తాండ్రపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటరులో ఉంటుందని తెలిపారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20 నుంచి 27వ తేదీలోపల వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ప్రింట్ రసీదును పొందాలన్నారు. ఈ నెల 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ర్యాంకుల వారిగా ఆప్షన్ల నమోదు చేసుకోవాలన్నారు. జూలై 1న ఆప్షన్‌లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని, 3వ తేదీన అలాట్‌మెంట్ ప్రకటిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీట్లు పొందిన అభ్యర్థులు రూ.4,700, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో చేరే అభ్యర్థులు రూ.25వేలు ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు, సందేహాలకు మీ సమీపంలోని హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9885940055ను సంప్రదించాలన్నారు. పీడ బ్ల్యూడీ, క్యాప్, ఎన్‌సీసీన, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వంటి స్పెషల్ కేటగిరీ అభ్యర్థులు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఈ నెల 21 నుంచి 1 నుంచి 15వేల ర్యాంకు, 22న 15001 నుంచి 32వేల ర్యాంకు, 23వ తేదీన 320001 ర్యాంకు నుంచి 50వేల ర్యాంకు, 24న 50001 ర్యాంకు నుంచి 68వేల ర్యాంకు, 25న 68,001 ర్యాంకు నుంచి 86వేల ర్యాంకు వరకు, 26న 86001 నుంచి 10,4000వ ర్యాంకు వరకు, 27న 10,4001 ర్యాంకు నుంచి 12,00,000ల ర్యాంకు వరకు, 28న 12,0001 ర్యాంకు చివరి ర్యాంకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దండి

నంద్యాల నూనెపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చదిద్ది వారి ఆర్థిక స్వాలంబనకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, మెప్మా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. నంద్యాల మున్సిపాల్టీలో 111, ఆళ్లగడ్డలో 24, ఆత్మకూర్‌లో 19, బేతంచెర్లలో 17, డోన్‌లో 26, నందికొట్కూర్‌లో 24 యూనిట్లను స్థాపించి మహిళల జీవనోపాధికి తోడ్పడాలని సూచించారు.

రేపు అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి):ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగే సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక 19న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవేందర్‌గౌడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు డీఎస్‌ఏ స్టేడియంలోని కర్నూలు క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. 1-9-2009 తరువాత 31.8.2011కు ముందు జన్మించిన వారు అండర్ 16 జట్టు ఎంపికకు అర్హులన్నారు. జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో ఎంపికకు రావాలన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ స్కూల్‌కు పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. అడ్మిషన్లు జూన్ 12వ తేదీ మొదలవుతాయని, ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు సమర్పించడానికి జూలై 30వ తేదీ చివరి గడువు అని తెలిపారు. అడ్మిషన్ల ఫీజు చెల్లించడానికి ఆఖరి గడువు జూలై 31వ తేదీ అన్నారు. ఆలస్య రుసుము రూ.200లతో అడ్మిషన్లు ఆన్‌లైన్ చేయడానికి ఆగస్టు 15వ తేదీ చివరి గడువు అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

సన్నబియ్యంతో సంబరాలు



పాణ్యం ఏపీ మోడల్‌స్కూల్‌లో విద్యార్థినికి భోజనం తినిపిస్తున్న కలెక్టర్ రాజకుమారి గణియా

- జిల్లాలో 1,382 పాఠశాలలకు 10,960 బ్యాగుల కేటాయింపు
- ఇంటి భోజనంలా ఉందంటున్న విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న అడ్మిషన్లు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మెరుగైన నూతన విద్యావిధానంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతతో కూడిన సన్నబియ్యం చేర్చడంతో విద్యార్థులు పాఠశాలల వైపు పరుగులు తీస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాధారణ రకం బియ్యాన్ని పాఠశాలలకు సరఫరా చేయడంతో తినలేక విద్యార్థులు ముఖం చాటేసేవారు. ప్రస్తుతం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం' పథకంతో సన్నబియ్యంతో వండిన అన్నం, ఆకుకూరపప్పు, బెల్లంపొంగలి, గుడ్డు, రాగిజావ, చిక్కీలతో పిల్లలకు మంచి రుచికరమైన పౌష్టికాహారం అందుతోంది. బడులు ప్రారంభించిన మొదటి రోజు నుంచే పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు సిద్ధం చేస్తున్నారు. ఒక్కసారిగా అడ్మిషన్లు వెల్లువలా వస్తున్నాయి. నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6వతరగతిలో ప్రవేశానికి రెండు రోజుల్లోనే 75 అడ్మిషన్‌లు వచ్చాయి. దీంతో ఏ విధంగా ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గుతున్నారో ఇట్టే తెలిసిపోతుంది.

జియో ట్యాగింగ్ ద్వారా సరఫరా

నంద్యాల జిల్లాలో 1,382 పాఠశాలలకు జూన్ నెలకు సంబంధించి 10,960(25కేజీలు) బ్యాగులు పౌర సరఫరాల సంస్థ ద్వారా చేరాల్సి ఉండగా నేటి వరకు 7,112 బ్యాగులను సరఫరా చేశారు. పాఠశాలలకు చేరేబియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది. ప్రతి బ్యాగుకు జియోట్యాగ్‌లను ఏర్పాటుచేసింది. పాఠశాలకు చేరిన ప్రతి బస్తాను స్కాన్ చేసి ఉన్నతాధికారులకు పంపేవిధంగా ఏర్పాటు చేసింది.

ఆహార పట్టిక ఇలా..

సోమవారం	- అన్నం, కూరగాయల కూర, ఉడికించిన గుడ్డు, చిక్కీ
మంగళవారం	- పులగం లేదా పులిహోర, పల్లిచట్నీకోడిగుడ్డు ఫ్రై, రాగిజావ
బుధవారం	- అన్నం, సాంబారు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం	- వెజిటబుల్‌రైస్, గుడ్డుకూర రాగిజావ
శుక్రవారం	- అన్నం, ఆకుకూరపప్పు ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం	- అన్నం, కందిపప్పుచారు బెల్లంపొంగలి, రాగిజావ



భోజనం చేస్తున్న విద్యార్థులు

ఒక్కో విద్యార్థికి 100- 200 గ్రాములు

జిల్లాలోని 989 ప్రైమరీ పాఠశాలల విద్యార్థులకు ఒక్కరోజుకు ఒక్క విద్యార్థికి 100 గ్రాములు కేటాయించగా వారికి ప్రతిరోజు 4,364 కేజీలు అవసరం. 139 ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు 150 గ్రాములు కేటాయించగా వారికి ప్రతిరోజు 5,624 కేజీలు అవసరం. 233 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి 150 గ్రాములు కేటాయించగా రోజుకు 4,675 కేజీలు అవసరం. 21 జూనియర్ కళాశాలలుండగా ప్రతి విద్యార్థికి 200 గ్రాముల చొప్పున ప్రతిరోజు 1,089 కేజీల సన్నబియ్యం అవసరమవుతాయి.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తింటున్న కలెక్టర్

బియ్యం నాణ్యతగా ఉన్నాయి



16 సంవత్సరాలుగా వంట ఏజన్సీ నిర్వాహకురాలిగా పనిచేస్తున్నాను. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం వస్తున్న బియ్యం ఎంతో నాణ్యతగా ఉన్నాయి. పిల్లలు ఎంతో ఇష్టంగా తింటున్నారు. మంచి కూరగాయలు, ఆకుకూరలతో పప్పు, చారు, వెజిటబుల్ కర్రీ చేస్తున్నాము. ప్రతి విద్యార్థి కడుపునిండా భోజనం పెడుతున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నాము.

\- శశికళ, ప్రభుత్వ బాలికల పాఠశాల వంట ఏజన్సీ నిర్వాహకురాలు

ఇంటి భోజనంలా ఉంది.



నేను నంద్యాల ప్రభుత్వ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. గతంలో లావుబియ్యంతో చేసిన భోజనం తినాలంటే ఇష్టం ఉండేది కాదు. ప్లేటులోనే సగం వదిలేసేవాళ్లము. నేడు ఒక్క మెతుకు కూడా వదలకుండా తింటున్నాము.

\- ధనలక్ష్మి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, నంద్యాల

కడుపునిండా తింటున్నాము



నేను 9వ తరగతి చదువుతున్నాను. పాఠశాల తెరిచిన మొదటి రోజు నుంచి మంచి రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారు. ప్రతి ఒక్కరం కడుపునిండా తింటున్నాము. అన్నంతో పాటు గుడ్డు కాకుండా గుడ్డుఫ్రై కూడా చేస్తున్నారు. శనివారం బెల్లంపొంగలి రుచే వేరు. మంచి భోజనం అందిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఉంటాము.

\- పావని, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, నంద్యాల

బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు



బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు తీసుకున్నాము. జియోట్యాగ్ ద్వారా బియ్యం ప్రతి పాఠశాలకు చేరేవిధంగా మూడు దశల్లో పర్యవేక్షిస్తున్నాము. విద్యార్థులకు మంచి రుచికరమైన ఆహారం వడ్డించాలని ఏజన్సీ నిర్వాహకులకు స్పష్టంగా తెలియజేశాము. ఏ మాత్రం అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాము.

\- శంకర్‌ప్రసాద్, డీవైఈవో, నంద్యాల

సీ బిల్ గుబుల్..




పొదుపు సంఘాల మహిళలు, అవగాహన

- పొదుపు మహిళలకు ఆటోల మంజూరు తప్పనిసరి
- బ్యాంకు రుణాలకు సీ బిల్ స్కోర్ లేక ఇబ్బందులు
- జిల్లాలో 176 మంది మహిళలకు ఆటోలు ఇప్పించాలని లక్ష్యం
- ఒక్కో పొదుపు సంఘానికి రూ.10 లక్షల నుంచి 15 లక్షల వరకు బ్యాంకు లింకేజీ

నంద్యాల టౌన్, జూన్17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పొదుపు సంఘాల పేరిట ఇతరులు బ్యాంకు నుంచి అప్పులు తీసుకున్నారు. వాళ్లు సకాలంలో తిరిగి చెల్లించలేదు. కొందరు మహిళలు కూడా సరిగా వాయిదాలు చెల్లించలేదు. వెరసి పొదుపు మహిళలు తిరిగి బ్యాంకు లోన్ తీసుకోవడానికి సీ బిల్ స్కోర్ తగినంత లేకపోవడంతో ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకుల నుంచి వారికి రావాల్సిన పలు రుణాలు రావడం లేదు.

మహిళా సాధికారిత సాధనలో భాగంగా జీవనోపాధుల యూనిట్లు పెట్టుకోవడానికి ముందుకు వచ్చే మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నంద్యాల జిల్లాలో ఇప్పటికే 176 మందికి ఆటోలు ఇప్పించాలని భావించింది. వాహనాలు మంజూరైనప్పటికీ సీ బిల్ స్కోర్ లేకపోవడంతో రుణాలు జారీ చేయడంలో జాప్యం జరుగుతున్నది. గతంలో రుణాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఈ ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికైనా పొదుపు మహిళలు గతంలో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలని, లేకపోతే ఇలాంటి వారికి రాబోయే రోజుల్లో ఇబ్బందవుతుందని అధికారులు చెబుతున్నారు.

దిద్దుబాటు చర్యలు ఆవశ్యం....



జిల్లాలో మెప్మా ఆధ్వర్యంలో సుమారుగా 4,333 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ సంఘాల అన్నింటికీ సుమారుగా ఒక్కో సంఘానికి రూ.10 లక్షల నుంచి 15 లక్షల వరకు రుణాలు మంజూరు చేశారు. వీరిలో 30 శాతం సంఘాలు సరిగా లావాదేవీలు సాగించడం లేదని తెలుస్తోంది. మొత్తం సంఘాల్లో 40శాతం సభ్యులకు సీ బిల్ స్కోర్ 700 కంటే తక్కువగా ఉంది. దీంతో అప్రమత్తమైన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) దీనిపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటోంది. రుణ వాయిదాలను సక్రమంగా చెల్లించపోతే సీ బిల్‌పై ప్రభావం పడుతోందని సభ్యులకు వివరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం.

రుణాలు తీసుకున్న వారందరూ సకాలంలో తిరిగి చెల్లించాలని పొదుపు సంఘాల్లోని వారందరికీ అవగాహన కల్పిస్తున్నాం. రుణాలు చెల్లించే వారు నేరుగా బ్యాంకు తమ గ్రూప్ లీడర్‌తో కలిసి వెళ్లాలని సూచిస్తున్నాం. ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. దీంతో కూడా సీ బిల్ సమస్యలు వస్తున్నాయి.

● నాగశివలీల, మెప్మా పీడీ, నంద్యాల జిల్లా

18 ఏళ్ల తర్వాత బదిలీ!

● కర్నూలు జీజీహెచ్ ఆఫీస్ సూపరింటెండెంట్ కడపకు బదిలీ

కర్నూలు హాస్పిటల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిపాలన విభాగంలో 18 ఏళ్లుగా వివిధ హోదాల్లో పని చేస్తూ ప్రస్తుతం ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఏ.శ్రీనివాసులు కడపకు బదిలీ అయ్యారు. మంగళవారం జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లో శ్రీనివాసులు కడప ఆర్‌డీ కార్యాలయానికి బదిలీ కాగా.. అక్కడ పనిచేస్తున్న రమేష్ ఆఫీసు సూపరింటెండెంట్‌గా కర్నూలు జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. హెల్త్ ఎడ్యుకేటర్‌లో రమణ గోస్పాడు నుంచి అహోబిళం, వెంకటమ్మ చాగలమర్రి నుంచి కడపకు బదిలీ అయ్యారు. ఆఫీస్ సూపరింటెండెంట్ సునీత కేఎంసీ నుంచి చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఒకే స్థానంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న సాధారణ ఉద్యోగులతో పాటు 9 సంవత్సరాల పాటు పనిచేసిన ఆఫీస్ బేరర్ ఉద్యోగులను కూడా బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకో వడంతో ఏళ్లకు తరబడి పాతుకుపోయిన వారి బదిలీ అనివార్యమైంది.

వైద్యఆరోగ్యశాఖలో 73 మందికి స్థానచలనం

కర్నూలు హాస్పిటల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉద్యోగులకు డీఎంహెచ్‌వో బదిలీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా క్యాడర్‌కు బదిలీలు చేశారు. 47 మంది మహిళా ఆరోగ్య కార్యకర్తలకు, 16 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు, ఏడుగురు డ్రైవర్లు, ముగ్గురు మేల్ ఆరోగ్య కార్యకర్తలకు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, కార్యాలయ ఏవో కె.అరుణ బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

హెడ్ నర్సులు బదిలీలు: గోనెగండ్ల పీహెచ్‌సీ నుంచి హెడ్ నర్సుగా పని చేస్తున్న ఎన్.లక్ష్మీనరసమ్మ కర్నూలు జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. హెడ్ నర్సులు కే.ఉమ, సుభాషిణి అనంతపురం జీజీహెచ్‌కు, కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఆరుగురు హెడ్ నర్సులు తిరుపతికి బదిలీ అయ్యారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు

- క్రికెట్ స్టేడియం నిర్మిస్తాం
- లక్ష్మీపురం టిడ్కో ఎదురుగా శంకుస్థాపన చేసిన మంత్రి టీజీ భరత్



క్రికెట్ స్టేడియం నిర్మాణ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కల్లూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ. భరత్ పేర్కొన్నారు. మంగళ వారం కల్లూరు మండలం లక్ష్మీపురం జగన్నాథగట్టు టిడ్కో గృహాల ఎదురుగా 6 ఎకరాల్లో గ్రీన్‌కో కంపెనీ సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం, క్రీడా కాంప్లెక్స్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ హైవేకి దగ్గరలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయడం గొప్పవిషయమన్నారు. కర్నూలు జిల్లా అభివృద్ధికి చిహ్నంగా ఇది నిలుస్తుందన్నారు. అదే విధంగా కోడుమూరు నియోజకవర్గంలో బాలసాయిబాబా స్కూల్ ప్రక్కన ఉన్న ఏసీఏ క్రికెట్‌గ్రౌండ్‌లో కూడా స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామ న్నారు. గ్రీన్‌కో కంపెనీ పీ-4 విధానం ద్వారా ముందుకు వచ్చి సీఎస్ఆర్ కింద రూ.4 కోట్లతో స్టేడియం నిర్మించడం అభినందించాల్సిన విషయమన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద పంప్‌డ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు కర్నూలు జిల్లాలో ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో మరిన్ని మంచి పరిశ్రమలు తీసుకుని వచ్చి ఉపాధి అవకాశాలు కూడా కల్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్ఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాల కల్పనకు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. పత్తికొండలో ఏర్పాటు చేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను త్వరలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటమని మంత్రి టీజీ. భరత్ తెలిపారు.

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ గ్రీన్‌కో సహకారంతో లక్ష్మీపురం జగన్నాథగట్టు వద్ద స్టేడియం, క్రీడా ప్రాంగణం తలపెట్టడం గర్వకారణమన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు మాట్లాడుతూ క్రీడాకారులు అవకాశాల కోసం హైదరాబాద్, విజయవాడ. విశాఖపట్టణం ఇక వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు సంకల్పం పీ-4 మోడల్ ఒక ఉదాహరణ అన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుం టుందన్నారు. కూడా చైర్మన్ సోమిశెట్టి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవీంద్రబాబు, గ్రీన్‌కో కంపెనీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, గ్రీన్ కో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ నాయుడు, తసీల్దారు కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి మార్పు

నందికొట్కూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన 24 గంటల్లోనే మరొకరికి బాధ్యతలు ఇస్తూ జేసీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం నందికొట్కూరు ఎంఎల్ఎస్ గోదాము ఇన్‌చార్జిగా నారాయణమ్మ రిలీవ్ కావడంతో ఆమె స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. అయితే మంగళవారం చంద్రశేఖర్ స్థానాన్ని మార్పుచేస్తూ కర్నూలు అర్బన్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న గిరికుమార్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. చంద్రశేఖర్‌ను నందికొట్కూరు సీఎస్‌డీటీగా గానూ, నందికొట్కూరు సీఎస్‌డీటీగా ఉన్న షానావాజ్‌ను మిడ్తూరు డిప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ జేసీ విష్ణు చరణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

పోక్సో కేసులో 20 ఏళ్లు కారాగారం

- 2022 కేసులో సంచలన తీర్పు


శిక్ష పడిన నిందితుడు తెలుగు గంగాధర్

కర్నూలు లీగల్/వెలుగోడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై అత్యాచారం కేసులో కర్నూలు జిల్లా పోక్సో కోర్టు సంచలన తీర్పునిచ్చింది. నిందితుడు గంగాధర్‌కు 20 ఏళ్లు కారాగార శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి రాజేంద్రబాబు మంగళ వారం తీర్పు చెప్పారు. జిల్లాలోని ఓ గ్రామంలో బాలికను మాయమాటలు చెప్పి గర్భిణిని చేసిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో వెలుగోడు పోలీసులు దాఖలు చేసిన చార్జ్‌షీటు మేరకు కోర్టు ఈ తీర్పు ఇచ్చింది. 2022 జూలై 14వ తేదీన జరిగిన ఈ నేరంలో అప్పటి ఆత్మకూరు ఇన్‌చార్జి డీఎస్పీ సి.మహేశ్వరరెడ్డి నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తర్వాత బాధితురాలికి ఒక మగశిశువు పుట్టి మృతి చెందాడు. ఆ మృత శిశువు రక్తం నమూనాలు సేకరించిన పోలీసులు డీఎన్ఏ టెస్టుకు పంపించారు. ఆ రక్త నమూనాలు నిందితుడి డీఎన్ఏతో సరిపోయాయని పోలీసులు కోర్టుకు నివేదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20ఏళ్లు జైలు శిక్షతో పాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. రూ.25వేలు బాధితురాలికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించింది. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీవీ శ్రీనివాసులు వాదించారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ రైడర్ మృతి

ప్యాపిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బైకు రైడర్ మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. ఎస్ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌కు చెందిన ఆదిత్య సుబ్రహ్మణ్యం(44)తో పాటు స్నేహితులు 11 మంది కలిసి బైకులపై పది రోజుల క్రితం ఊటికి వెళ్లారు. అక్కడ రెండు రోజులు ఆనందంగా గడిపారు. తిరిగి సొంత రాష్ట్రానికి బైకులపై బయలుదేరారు. మార్గమధ్యంలోని ప్యాపిలి సమీపంలోకి రాగానే సుబ్రమణ్యం బైకు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగాయాలు కావడంతో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రాక్టర్ కిందపడి రైతు..

తుగ్గలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనాబాదులో పొలంలో ట్రాక్టర్‌తో కంది గుంటక వేస్తుండగా ట్రాక్టర్ కిందపడి శ్రీనివాసులు చౌదరి(51) అనే రైతు మంగళ వారం మృతి చెందాడు. వివరాల మేరకు.. ట్రాక్టరుతో పని చేస్తుండగ ట్రాక్టరు చక్రం పొలంలోని రాయిని ఎక్కడంతో అదుపు తప్పింది. డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాస చౌదరి ట్రాక్టరుకింద పడి తీవ్రగాయాలకు గురయ్యాడు. చుట్టుపక్కలే ఎవరూ లేరు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ తన వద్ద ఉన్న సెల్ ద్వారా భార్యకు తెలిపాడు. హుటాహుటిన బంధువులు, గ్రామస్థులు పొలానికి వెళ్లి శ్రీనివాసచౌదరిని గుత్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీనివాసులు చౌదరి (ఫైల్)

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

గోనెగండ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు తనకు భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ విజయభాస్కర్ తెలిపిన మేరకు.. గోనెగండ్లకు చెందిన బాలముని మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి భార్య నరసమ్మను డబ్బులు అడిగాడు. లేవని చెప్పడంతో ఊగిపోతూ గ్రామ శివార్లలోని పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున బాలముని మృతిచెందాడు. భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి

- తల్లికి వందనం డబ్బులు ఇవ్వలేదని...
- కేసు నమోదు చేసిన పోలీసులు

నంద్యాల/ఉయ్యాల వాడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం కింద వచ్చిన డబ్బులు ఇవ్వలేదని భార్యపై కత్తితో దాడిచేసిన ఘటన నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం కొండుపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన వెంకటనరసింహుడు, సుమిత్ర దంపతులకు ఇద్దరు పిల్లలు. ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద రూ. 21వేలు సుమిత్ర ఖాతాలో జమ చేసింది. తాగుడుకు బానిసైన భర్త వెంకటనరసింహుడు ఆ డబ్బులు తనకు ఇవ్వాలని భార్యపై ఒత్తిడి తీసుకువచ్చాడు. దానికి ఆమె నిరాకరించింది. దీంతో వెంకట నరసింహుడు ఆమెను కత్తితో దాడి చేశాడు. బలమైన గాయం కావడంతో స్థానికులు ఆళ్లగడ్డ ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. దీనిపై సుమిత్ర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఉయ్యాలవాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

సీవో, ఆర్పీ మధ్య గొడవ

- రూ.30 వేల విషయంలో ఘర్షణ
- విచారించి మెమోలు జారీ చేసిన పీడీ


విచారణ చేస్తున్న మెప్మా అధికారులు

నంద్యాల టౌన్, జూన్17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మంగళవారం ఇద్దరి మహిళల మధ్య గొడవ జరిగింది. ఒక సీవో, ఒక ఆర్పీ మధ్య రూ.30 వేలు డబ్బులు విషయంలో ఇద్దరి మధ్య ఉదయం నుంచి గొడవ జరుగుతున్నట్లు సమాచారం. అయితే గొడవ పెరిగి పెద్దదై సాయంత్రానికి చెప్పులతో కొట్టుకున్నట్లు సమాచారం. రుణాలు మంజూరు ప్రతి సారి లంచాలు ఇవ్వాల్సిందేనా.? అన్నట్లు వారితో గొడవ పడ్డారు. దీంతో రంగంలో కర్నూలు నుంచి ఆకస్మాత్తుగా పీడీ నాగశివ లీలా ప్రత్యక్షమై ఏమీ జరగనట్లు వ్యవహరించారు. అప్పటికే సమాచారం తెలియడంతో చేసేదేమీ లేక మెమోలు జారీ చేసి వారి నుంచి వివరణ వచ్చిన తర్వాత చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా నుంచి అధికారులు ఇద్దరితో విచారణ చేపట్టారు.

సిమెంటు ఫ్యాక్టరీకి రాజకీయ గ్రహణం

- కార్మికుల కష్టాలను పట్టించుకోని యాజమాన్యం
- రాజకీయాలకతీతంగా ఫ్యాక్టరీని నడిపించాలని కార్మికుల విజ్ఞప్తి



మూతపడిన సిమెంటు ఫ్యాక్టరీ .. ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని కార్మికుల దీక్షలు

బేతంచెర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గంలోని బేతంచెర్ల మండల సిమెంటునగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీకి రాజకీయ గ్రహణం పట్టుకుంది. ఈ ఫ్యాక్టరీపై రాజకీయ ఆధిపత్యం కొనసాగించేందుకు పాణ్యం రాజకీయ నాయకులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ప్రత్యర్థులు బిజ్జం సత్యంరెడ్డి మధ్య జరిగిన పోరులో కార్మికులు నలిగి పోయారు. సిమెంట్‌నగర్ కార్మిక నాయకుడు సూర్యానారాయణ 1987లో హత్యకు గురయ్యాడు. అప్పటి నుంచి పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల పరిస్థితి అధ్వానంగా కొనసాగుతుంది. అనంతరం నంద్యాల నంది పైపుల యాజమాన్యం సిమెంటు ఫ్యాక్టరీ నిర్వహణ చేపట్టింది. కార్మికులకు జీతభత్యాలు ఇచ్చి ఫ్యాక్టరీ నిర్వహించింది. కర్ణాటక బెంగుళూరు ప్రాంతాల్లో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీకి చెందిన ఆస్తులన్నీ విక్రయించడంతో ఫ్యాక్టరీ అధోగతి పాలైంది. అప్పటి నుంచి కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎస్వీై రెడ్డి అల్లుడు శ్రీధర్ రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న కాలంలో ఫ్యాక్టరీని మూసివేశారు. కార్మికుల కుటుంబాల పోషణ కూడా భారమైంది. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుతం ఉన్న సాగర్ సిమెంటు యాజ మాన్యం ఫ్యాక్టరీ నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. ఈ యాజమాన్యం రిటైర్డు డీఎస్పీ నరసింహారెడ్డి, సిమెంటు నగర్ సర్పంచ్ మరియమ్మ కుమారుడు యాకోబు ఫ్యాక్టరీలో విధులు నిర్వహించే 13 మంది కార్మికులను పనుల్లోకి రాకుండా చేశారు. వైసీపీ కండువా వేసుకున్న వారిని విధుల్లోకి చేర్చుకున్నారు. టీడీపీకి చెందిన వారిని విధుల్లోకి తీసుకోకపోవడంతో వారు ఎన్‌సీఎల్టీ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఈ 13 మంది కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయినా యాజమాన్యం ఒప్పుకోక పోవడంతో వారు ఫ్యాక్టరీ బైటే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ విషయంపై లేబర్ కోర్టును కూడా ఆశ్రయించామని, అక్కడా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని కార్మికులు తెలిపారు. అంతలోనే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంత వరకు ఉన్న యాజమాన్యం ఫ్యాక్టరీని మూసివేసింది. అయినా వైసీపీకి చెందిన కార్మికులకు మాత్రం నెలకు రూ. కోటి దాక జీతాలు కింద చెల్లిస్తుందని, మరో రూ.2కోట్లు పెట్టుకుంటే ఫ్యాక్టరీ నడుస్తుందని పలువురు కార్మికులు ఆరోపించారు. ఫ్యాక్టరీలో ఉన్న స్క్రాప్ అంతా అమ్మడంతో బుగ్గనకు రూ.300 కోట్లు, యాజమాన్యానికి రూ.300 కోట్లు ఆదాయం వచ్చిందని, ఆ తర్వాత ఫ్యాక్టరీ మూసివేశారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా రాజకీయ పార్టీలతో సిమెంట్ ఫ్యాక్టరీ తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు దీక్షలు చేపట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని రాజకీయ పార్టీల జోక్యం లేకుండా సజావుగా నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం


కె.శివ (ఫైల్)

కర్నూలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే స్టేషన్‌లో గద్వాల జిల్లా కుర్వపల్లి గ్రామానికి చెందిన కె. శివ (20) అనే యువకుడు అదృశ్యమయ్యారు. శివకు మతిస్థిమిత లేక పోవడంతో గత శనివారం గద్వాల రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి కర్నూలు రైల్వే స్టేషన్‌లో దిగారు. బంధువులు కర్నూలు రైల్వే స్టేషన్, కొత్తబస్టాండ్, బళ్లారి చౌరస్తా, నంద్యాలచెక్‌పోస్టు ప్రాంతాల్లో వెతికినా దొరకలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించడంతో సీసీకెమెరాల్లో చూశారు. సీసీకెమెరాల్లో కర్నూలు స్టేషన్‌లో దిగి మూడు గంటల పాటు అటు, ఇటూ తిరిగి మళ్లీ డోన్ వైపు వెళ్లే రైలు ఎక్కాడని తేలింది. డోన్, వెల్దుర్తి, గుంతకల్లు స్టేషన్లలో వెతికినా యువకుడు కనిపించలేదు. కర్నూలు రైల్వే పోలీసులకు యువకుడి ఆచూకీ లభించలేదని మంగళవారం చెప్పడంతో వారు గద్వాలలో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు గద్వాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఈయువకుడి ఆచూకీ తెలిస్తే పోలీసులకైనా, బంధువుల 9652973618, 9573152014లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనాథ పిల్లలకు ఆధార్ ఇవ్వాలని ఆదేశం



మాట్లాడుతున్న బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అనాథ బాలలకు ఆధార్ కార్డులు ఇవ్వాలని కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మంగళవారం ఆదేశించారు. స్థానిక వెంకట రమణ కాలనీలోని పంప్ హౌస్ ఎదురుగా నిర్వహిం చిన తనిఖీలలో 22 మంది అనాథ బాలలకు గుర్తింపు కార్డులు లేవని అన్నారు. వీరందరికీ సాఫీ కమిటీ వారు వెంటనే ఆధార్ కార్డులు ఇవ్వాలని అన్నారు. ఆ తర్వాత స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో సాఫీ కమిటీ వారితో ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి జిల్లాలో అనాథ బాలలను గుర్తించాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ పి. నిర్మల, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద తదితరులు పాల్గొన్నారు.

ఉప లోకాయుక్త జోక్యంతో రైతులకు పరిహారం

కర్నూలు లీగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని గురు రాఘవేంద్ర ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టాన్ని నీటి పారుదల శాఖ అధికారులు తప్పుగా చూపించడంతో నష్టపోయిన రైతులకు పరిహారాన్ని చెల్లించాలని రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. మంత్రాలయం మండలంలోని చిలకలడోన గ్రామంలోని గురు రాఘవేంద్ర ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టాన్ని జలవనరుల శాఖ అధికారులు తప్పుగా నిర్ధారించడంతో తమ పొలాలు మునిగి నష్టపోయినట్లు రైతు ఆర్.రాఘవరెడ్డి ఉప లోకాయుక్తకు గతంలో ఫిర్యాదు చేశారు. ఉప లోకాయుక్త ఈ కేసును విచారించి కర్నూలు కలెక్టర్, జలవనరుల శాఖ అధికారులకు నివేదికలు అందజేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు విచారించి ప్రాజెక్టు కింద ఉన్న 53 మంది రైతులు నష్టపోయారని నిర్ధారించి, వారికి రూ.13,40,740 నష్ట పరిహారంగా నిధులు మంజూరు చేశారు.

ఇద్దరు విద్యార్థులు.. ఒక ఉపాధ్యాయుడు!


పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు సుబ్బయ్య

చాగలమర్రి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. ఈ ఏడాది 1వ తరగతిలో కొత్తగా ఇద్దరు విద్యార్థులు మాత్రమే చేరారు. ఆ విద్యార్థులకు ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. గత ఏడాది 1 నుంచి 5వ తరగతి వరకు నలుగురు విద్యార్థులు మాత్ర మే ఉన్నారు. 2వ తరగతిలో ఇద్దరు, 3వ తరగతిలో ఇద్దరు విద్యార్థులు మాత్ర మే ఉన్నారు. పెద్దవంగలి గ్రామంలోని మెయిన్ పాఠశాలను మోడల్ పాఠశాలగా ఏర్పాటు చేయ డంతో ఉన్న నలుగురు విద్యార్థులు ఆ పాఠశాలకు వెళ్లారు. ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో కేవలం 1, 2 తరగతులు మాత్రమే నిర్వహిస్తున్నారు.

కొత్తగా చేరిన ఇద్దరు విద్యార్థులకు మాత్రమే ఉపాధ్యాయుడు పాఠశాలు బోధిస్తున్నారు. వంట ఏజెన్సీ మహిళ ఆ ఇద్దరు విద్యార్థులకే భోజనం తయారు చేసి వడ్డించారు.

ఎంఈవో అనూరాధను వివరణ కోరగా విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.

బియ్యం దొంగలపై పోలీసులకు ఫిర్యాదు

- కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు


బియ్యం గోడౌన్‌ను సీజ్ చేస్తున్న అధికారులు(ఫైల్)

ఆదోని రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని - శిరుగుప్ప ప్రధాన రహదారిలోని ఓ గోడౌన్‌లో రేషన్ బియ్యాన్ని ఈనెల 13వ తేదిన సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్ నాయుడు దాడులు చేసి సీజ్ చేసిన విషయం విధితమే. అయితే 1,500 బస్తాల బియ్యాన్ని గుర్తించగా, మరుసటి రోజు 109 బస్తాలే కనిపించాయి. బియ్యం మాయమైన విషయం తెలిసి మంగళవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ రమేష్, డీటీ బాబురావు ఆదే శాల మేరకు వీఆర్వో రాజశేఖర్ గౌడ్ పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, సెల్‌ఫోన్ టవర్ల సాయంతో బియ్యం దొంగలను గుర్తిస్తామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

అదుపులో బియ్యం దొంగలు

- ఆలూరులో 34 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం
- వాహనం సీజ్, ఇరువురిపై కేసు నమోదు


గోదాంలో భద్రపరుస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు


ఈ వాహనంలోనే బియ్యాన్ని తరలించారు

ఆలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడిగుడ్డం సమీపంలో సోమవారం అర్ధరాత్రి 34 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు.

వివరాల మేరకు.. ఏపీ39 డబ్ల్యూటీ 3291 నంబర్ గల బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని ఆదోని వైపు తరలి స్తుండగా స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రామకృష్ణ, లింగన్న ఆధ్వర్యంలో వాహనాన్ని సీజ్‌చేసి బియ్యాన్ని ఆలూరు సివిల్ సప్లై గోదాంకు ఏఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తరలించారు. ఆదోనికి చెందిన ఇందప్ప, షేక్షావలిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు.

మహిళలతో బ్యాంకులు రద్దీ..

● తల్లికి వందనం డబ్బులు, ఉపాధి బిల్లులు డ్రా చేసుకునేందుకు తరలివచ్చిన వైనం

తల్లికి వందనం డబ్బులు, ఉపాధి హామీ బిల్లులు ఖాతాలోకి జమ కావడంతో మంగళవారం బ్యాంకులన్నీ తల్లిదండ్రులు, ఉపాధి కూలీలతో నిండిపోయాయి. మండల కేంద్రమైన ఓర్వకల్లులోని కెనరా బ్యాంకు, నన్నూరు రాయలసీమ గ్రామీణ బ్యాంకులలో పెద్ద ఎత్తున ఖాతాదారులు డబ్బులు డ్రా చేసుకున్నారు. దీంతో బ్యాంకులు ఖాతాదారులు, తల్లిదండ్రులతో కిటకిటలాడాయి.

\- ఓర్వకల్లు



ఓర్వకల్లు కెనరా బ్యాంకులో ఖాతాదారుల రద్దీ

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసి, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం న్యూసిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు కె. ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో 36వ వార్డు పెద్దపాడు సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కె.ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ అడ్మిన్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో పెద్దపాడు సీపీఎం కార్యదర్శి గోపి, వరలక్ష్మీ, మహేష్, రాజు, చిరంజీవి, నారాయణ, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంకు సీఈవోకు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంకు సీఈవో పి.రామాంజనేయులు నూతన సీఈవోగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మంగళవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, జిల్లా కన్వీనర్ నాగేంద్ర, ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డి.హుశేన్, ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర గౌరవాధ్యక్షులు శివకుమార్, నగర అధ్యక్షుడు శివశంకర్, నగర ప్రధాన కార్యదర్శి ఎర్రమల, ఫొటోగ్రాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డె శ్రీనివాసులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు నర్సిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు, జర్నలిస్టులకు లోన్‌హౌసింగ్, విద్యార్థులకు లోన్లు అందించాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నారాయణ పాఠశాల వద్ద
ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నగరంలోని నారాయణ పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్నటువంటి విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పుస్తకాలు, ధర్నాలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, నగర అధ్యక్ష కార్యదర్శి అభిరామ్, అశోక్; నాయకులు సాయి, లోకేశ్, సమీర్, అఖిల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు విద్యామిత్ర కిట్ల పంపిణీ



రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను
పంపిణీ చేస్తున్న సర్పంచ్ మధుకేశన్న

ఓర్వకల్లు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం సర్పంచ్ మధుకేశన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను, అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పుస్తకాలు, బ్యాగ్, బెల్టులు, షూస్; సాక్స్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం: వైసీపీ



ఓర్వకల్లులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

ఓర్వకల్లు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యమని జడ్పీటీసీ రంగనాథగౌడు ఎంపీపీ తిప్పన్న విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం ముందు జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమం లేదన్నారు. అన్ని అబద్ధాలు, మోసాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంగన్న, పెద్దయ్య, హరినాతరెడ్డి, శంకర్ రెడ్డి, నాగ తిరుపాలు, మదుసూదన్, సుంకిరెడ్డి, చిన్న అయ్యన్న, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'పై విషం కక్కుతున్న వైసీపీ



మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనంపై వైసీపీ విషం కక్కుతుందని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఓర్వకల్లులో ఆయన మాట్లాడుతూ ఇంటిలో ఎంత మంది చదువుకున్న విద్యార్థులుంటే అంత మందికి పథకాన్ని వర్తింపజేస్తుంటే.. కడుపు మంటతో వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. రూ.2వేలు లోకేశ్ జేబులోకి వెళ్లాయంటూ దిగజారుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, అల్లాబాబు ఉన్నారు.

మార్పులతో నగర రూపురేఖలు మార్చాలి

● నగర పాలక అధికారులతో మంత్రి టీజీ భరత్
● ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాలపై సమీక్ష
● అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి
● బ్యానర్లు, పోస్టర్లు అతికించడం మానుకోకపోతే కేసులు



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగర రూపురేఖలు మార్చేందుకు అవసరమైన మార్పులు చేపట్టి, కర్నూలును రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ నగర పాలక అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబుతో కలిసి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ముందుగా గుత్తేదారులతో మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, లెస్‌లకు 5 శాతం కంటే ఎక్కువ పోవద్దని సూచించారు. 5 శాతం కంటే ఎక్కువ లెస్‌లకు టెండరు వేసిన పనులపై, క్వాలిటీ కంట్రోల్ బోర్డు ద్వారా నాణ్యత ప్రమాణాలు తనిఖీలు చేశాకే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. అదే విధంగా పనులు దక్కించుకుని ప్రారంభించకుండా జాప్యం చేస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరించారు. అనంతరం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో, ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడారు. నగరంలో ఆక్రమణలను ఉపేక్షించొద్దని, దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వెండర్స్ జోన్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలని బహిరంగ ప్రదేశాల రహదారులపై తోపుడు బండ్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో వీధి వ్యాపారులు ఎంత మంది ఉన్నారో.. అనుమతులు ఎంత మంది తీసుకున్నారో వంటి వివరాలను వారంలోగా తనకు అందజేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువ ఉన్న ప్రదేశాల్లో రహదారుల ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం చేయొద్దని స్పష్టం చేశారు. రహదారులపై కూడళ్లపై బ్యానర్లు, పోస్టర్లు అతికించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత వ్యక్తులు జరిమానాతో వినకపోతే కేసులు నమోదు చేసేందుకు వెనుకాడొద్దన్నారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించే ఆక్రమణలు తక్షణమే తొలగించాలని, ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు అన్వేషించి వెండర్ జోన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ప్రజారోగ్య అధికారి డా.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీల ప్రసాద్, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, కార్పొరేటర్ పరమేష్, డీఈఈలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్లూరు మండల సమావేశం

కల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.నాగేశాచలరెడ్డి తెలిపారు. ఎంపీపీ బి.శారద అధ్యక్షతన ఉదయం 10.45 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే, ఎంపీ హాజరువుతారని ఆయన తెలిపారు.

నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 10 నుంచి 1 గంట వరకు సంతోష్‌నగర్, బళ్లారిరోడ్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా కాలనీలు, ఫీడర్ల పరిధిలో కరెంట్ ఉండదన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గుర్తించి అధికారులు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

కబడ్డీ విజేతలు
నారాయణ, మున్సిపల్ పాఠశాల



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన అంతర్ పాఠశాలల కబడ్డీ బాలుర పోటీల్లో ఎల్కూరు బంగ్లా వద్ద ఉన్న నారాయణ పాఠశాల జట్టు విజేతగా నిలవగా.. జోహరాపురం మున్సిపల్ హై స్కూల్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేంద్ర పాల్గొని క్రీడలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో క్రీడల్లో రాణించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ పోటీల ఇన్‌చార్జి కొండేపోగు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సి.బెళగల్‌లో పత్తి పంటపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి. బెళగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో వెంకటేశ్వర్లు అనే రైతు సాగు చేసిన పత్తిపంటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ పత్తి పంటకు ఎక్కువ శాతం పచ్చపురుగు దోమపోటు ఎక్కువగా వస్తుందన్నారు. దానిని అదుపు చేసుకోవడానికి వేపనూనె, మోనోక్రోటోపాసును కలిపి పిచికారి చేయాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈవో వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ చంద్రశేఖర్, బాలజివెంకటేశ్, దనుంజయుడు, విష్ణుహామాలి యూనియన్‌నాయకుడు బీమన్న ఎంపీఈవోలు ఉన్నారు.

జాయింట్ ఎల్పీఎం సమస్య పరిష్కరించండి



వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

కల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో ప్రభుత్వ భూములకు జాయింట్ ఎల్పీఎం సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో కల్లూరు తహసీల్దార్ కె.ఆంజనేయులుకు వినతి పత్రం అందించారు. కె.కృష్ణ మాట్లాడుతూ ఉలిందకొండ, కొల్లంపల్లి తాండ, ఎర్రకత్వ, యాపర్లపాడు, తడకనపల్లె, ఓబులాపురం తాండ గ్రామాల్లో ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న పేదలకు పట్టాలు పంపిణీ చేశారన్నారు. రీసర్వే ప్రక్రియలో ప్రభుత్వ భూములన్నింటికీ ఒకే ఎల్పీఎం నెంబర్ ఇవ్వడంతో అర్హులైన పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉలిందకొండ గ్రామంలో దాదాపు 90శాతం రైతులు తల్లికి వందనం పథకానికి దూరమయ్యారన్నారు. అర్హులైన పేదలందరికీ తల్లికి వందనం పథకం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పూలరంగడు, గోపాల్, రమేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మీబాయి, సావిత్రిబాయి పాల్గొన్నారు.

'హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం'



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఒలంపిక్ డే సంబరాల సందర్భంగా మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అంతర్ పాఠశాలల బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ సభ్యులు గుడిపల్లి సురేందర్ ప్రారంభించారు. పది విద్యాసంస్థలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఓటమి గెలుపులను సమానంగా తీసుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. రోజు న్యూస్ పేపర్ చదివి నాలెడ్జిని పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, హాకీ అసోసియేషన్ ప్రతినిధి దాసరి సుధీర్, చిన్న సుంకన్న, వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్బయ్య, దాసు, దయానందన్, జనార్దన్, ఈశ్వర్, ప్రతాప్, రామేశ్వరితో పాటు హ్యాండ్‌బాల్ రెఫరీస్ బోర్డు సురేందర్ పాల్గొన్నారు.

వాల్మీకి బోయ ఎస్టీ పునరుద్ధరణపై
రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు

కర్నూలు కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయ ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణపై 22న విజయవాడలోని వాల్మీకి భవన్‌లో రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ఏపీవీబీఎస్ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎల్లార్తి అర్జున్ మంగళవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాల్మీకి బోయ ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణపై కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా సంఘాలకు అతీతంగా, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్‌లు, డైరెక్టర్లు, వాల్మీకి సంఘాలసీనియర్ నాయకులు, ఎస్టీ ఉద్యమ కారులు, మహిళలు, యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'తల్లికి వందనం'పై వైసీపీ దిగజారుడు ఆరోపణలు

● కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కర్నూలు రూరల్ జూన్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం పథకంపై వైసీపీ నాయకులు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంట్లో ఎంతమంది పిల్లలు స్కూల్‌కు వెళ్తుంటే అంతమందికి సీఎం చంద్రబాబు రూ.13వేలు తల్లుల ఖాతాలో జమ చేస్తే వైసీపీ నాయకులు ఓర్వలేక విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రూ.2వేలు లోకేశ్ జేబులోకి వెళ్లాయంటు వైసీపీ నేతలు చేసిన ఆరోపణలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించి...మేనమామగా ఉంటానని.. ఎంతవరకు చదువుకుంటే అంతవరకు చదివిస్తానని మాయమాటలు చెప్పి బడుగు,బలహీన వర్గాలకు చెందిన 12లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసింది మీరు కాదా జగన్‌రెడ్డి అని ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నించారు. విద్యార్థులకు పెట్టే చిక్కీలు,కోడిగుడ్లు,కందిపప్పులో కూడా కమీషన్‌లు తీసుకున్న నీచ చరిత్ర కలిగిన పార్టీ వైసీపీదని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అమ్మ వడి డబ్బులు కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఎప్పుడు పడతాయంటూ ఎదురు చూశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక స్కూల్ ప్రారంభంలోనే అర్హులైన ప్రతి తల్లుల ఖాతాలోకి సీఎం చంద్రబాబు నగదు జమ చేశారని గుర్తు చేశారు. విద్యార్థుల తల్లులు సంతోషంగా ఉంటే జగన్‌రెడ్డి అండ్ కో మాత్రం జీర్ణించుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు వ్యాఖ్యాలను ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరని అన్నారు.

మండల కేంద్రాల్లో ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మునెప్ప

కర్నూలు న్యూసిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించిన పని గంటల మార్పుకు వ్యతిరేకంగా 20న చేపట్టే మండల కేంద్రాల్లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు మార్చాలని, రాత్రివేళల్లో మహిళలతో పని చేయించాలనే తీసుకున్న నిర్ణయం సబబు కాదన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో నగర అధ్యక్ష,కార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్, టి.రామాంజనేయులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో విఫలం



పోస్టరు విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.నాగరాముడు విమర్శించారు. మంగళవారం సీఆర్ భవన్‌లో జూన్ 15 నుంచి జులై 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏఐవైఎఫ్ చేపట్టే కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నాగరాముడు మాట్లాడుతూ ఏడాదిలోనే 2 లక్షల 60 వేల వలంటీర్లను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. 20న అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద అర్జీలు పంపించే కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నగర అధ్యక్ష,కార్యదర్శులు నాగరాజు. బీసన్న, నాయకులు చంటి, ఖాసిం, అఖిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

జమ్మన్న మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

కర్నూలు న్యూసిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ కర్నూలు జిల్లా ఉద్యమ నిర్మాత వై.జమ్మన్న మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు రాధాక్రిష్ణ, అంజిబాబు, ఆనంద్‌బాబు అన్నారు. మంగళవారం తిమ్మన్న మృతదేహాన్ని ఆయన స్వగృహంలో సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ నరసింహ, రాజు, సత్యం, మునిస్వామి తదితరులుపాల్గొన్నారు.

ఉద్యోగులకు నోటీసులు ఇవ్వడం సరికాదు

కర్నూలు న్యూసిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి వార్డు సచివాలయ ఉద్యోగులకు హాజరుకాలేదనే నెపంతో షోకాజు నోటీసులు ఇవ్వడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు విమర్శించారు. మంగళవారం కేకే భవన్‌లో ఆయన మాట్లాడుతూ యోగాంధ్రకు హాజరుకాలేదని షోకాజు నోటీసులు ఇవ్వడంతో పాటు ఒక్కరోజు వేతనం కూడా కట్ చేయడానికి నగర పాలక కమిషనర్ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అటువంటి ప్రయత్నాలు తక్షనమే విరమించుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో రాజశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాను నిరంతరం కొనసాగిస్తాం: ఉపకులపతి

కర్నూలు అర్బన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల, ఉద్యోగుల భద్రతకు యోగాను నిరంతరం కొనసాగిస్తామని ఉపకులపతి వి. వెంకట బసవ రావు అన్నారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీలోని ఔట్‌డోర్ స్టేడియంలో విద్యా నైపుణ్యాల యోగా అనే అంశంపై నిర్వహించే 4 రోజుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. నంద్యాలకు చెందిన రావర్తి రామా అకాడమీ ఆఫ్ సైన్సెస్ సంయుక్త భాగస్వామ్యంతో వర్క్ షాపును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ విజయకుమార్, కంట్రోలర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కుంటలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

సి. బెళగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ నీటి కుంటలను తవ్వుకోవడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. భూగర్భజలాలు పెరగడంతో పాటు వ్యవసాయ పంటపొలాలకు మందులు పిచికారి సమయంలో దూరప్రాంతాలను నీటిని తెచ్చుకోవడం భారం తగ్గుతుందన్నారు. పొలాల గెట్ల దగ్గర నీటి కుంటలను తవ్వుకునే విధంగా సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో రామన్న, ఈసి రంగస్వామి, సిబ్బంది ఉన్నారు.

ఉల్లినారకు భలే డిమాండ్



సి. బెళగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఉల్లికి మంచి డిమాండ్ ఉండడంతో రైతులు అధిక సంఖ్యలో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని పోలకల్లు, ముడుమాల, పల్దొడ్డి, కంబంధహల్, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి గ్రామాల్లో ఉల్లినార పోశారు. ప్రస్తుతం విక్రయించేందుకు ఉల్లినార రావడంతోకొనుగోలు చేసేందుకు తెలంగాణ రాష్ట్రం ఐజ, మల్దకల్, అలంపూరు, కర్నూలు జిల్లా నుంచి రైతులు తరలివస్తున్నారు. ఇక్కడి రైతులు ఎకరాల్లో ఉల్లి నార సాగు చేశారు. సుమారు లక్ష నుంచి రూ. 3లక్షల వరకు లాభాలు వస్తాయని రైతులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శిరివెళ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోవిందపల్లె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందారు. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. యర్రగుంట్లకు చెందిన అనసూయమ్మ, ఆమె సోదరుడు పుల్లారెడ్డి ఈ నెల 15న ద్విచక్రవాహనంపై కామినేనిపల్లె గ్రామం నుంచి యర్రగుంట్లకు వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఎదురుగా ఢీకొట్టిందన్నారు. ఈ ఘటనలో అనసూయమ్మ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

'తల్లికి వందనం' వర్తింపజేయాలి

ఆలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని సీఐటీయూ నాయకుడు నారాయణస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీఇచ్చి జీవో విడుదల చేయలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం కూడా జగన్ పాలసీని అమలు చేయడం సరికాదన్నారు.

వైసీపీ వెన్నుపోట్లు ప్రజలకు తెలుసు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

దేవనకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వైసీపీ వెన్నుపోట్లు ప్రజలకు తెలుసని టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, మలకన్న అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ అధికారం కోసం జగన్ బాబాయికి కత్తిపోట్లు, తల్లికి, చెల్లికి ఆస్తి పోట్లు, ప్రజలకు అప్పుల భారంతో వెన్నుపోట్లు పొడిచారన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి కోసం ఆహర్నిశలూ కష్టపడుతుంటే, సహకరించాల్సిందిపోయి, ఎమ్మెల్యే విరుపాక్షి వెన్నుపోటు పుస్తకాలు ఆవిష్కరించడం హాస్యాస్పదమన్నారు. వీరేష్, మాల బండ్లయ్య, సూభాన్, ఖాసిం పాల్గొన్నారు.

పిల్లలందరికీ 'తల్లికి వందనం'



కేఈ నందీష్‌ను అభినందిస్తున్న నాయకులు, తల్లిదండ్రులు

క్రిష్ణగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కుటుంబంలోని పిల్లలందరికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేసి, రూ.13వేలు ఇస్తుందని తెలుగు యువత నాయకుడు కేఈ నందీష్ అన్నారు. మంగళవారం గుడెంపాడు గ్రామంలో తల్లికి వందనం లబ్ధిదారులతో అభినందన సమావేశం నిర్వహించారు. చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే వారందరికీ అమలు చేశారన్నారు.

తాగు నీరు కలుషితమైతే వ్యాధులు



పోస్టర్లను విడుదల చేస్తున్న నోడల్ అధికారి రఘు

వెల్దుర్తి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తాగునీరు కలుషితమైతే వాంతులు, వీరేచనాలు, కామెర్లు, దోమకాటు వలన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలుతాయని నోడల్ అధికారి రఘు అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్.పేరు సోముల గ్రామం ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న సంచార చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనారోగ్య సమస్య తలెత్తితే ఆరోగ్య కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఆరోగ్య అధికారి మునెమ్మ, ఆరోగ్య కార్యకర్త మహేశ్వరి, నాగమ్మ, సుజాత, ప్రాజెక్టనీస్టు ఖలీల్ పాల్గొన్నారు.

కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోండి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి సుధాకర్

ఆదోని రూరల్, జూన్ 17 ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు కార్డు మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో సుధాకర్ సూచించారు. మంగళవారం ఢణాపురం, నారాయణపురం గ్రామాల్లో పిలుస్తోంది నిర్వహించారు. రైతులతో మాట్లాడుతూ నూతన సాంకేతిక పద్ధతులను పాటిస్తే దిగుబడి పెరుగుతుందన్నారు. సాగు చేసేముందు అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఏఈవో సతీష్, మౌనిక, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాలువలను నిర్మించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

దేవనకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కాలువలను నిర్మించాలని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. కాల్వలు లేకపోవడంతో మురుగు రోడ్డుపైనే నిలిచి, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అనంతరం ఎంపీడీవో బీవీ రమణరావుకు వినతిపత్రం అందజేశారు. మహేంద్ర, మురళి, చిన్న, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే లక్ష్యంగా యోగాంధ్ర



యోగా చేస్తున్న ఉపాధి కూలీలు

మద్దికెర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం యోగాంధ్ర-2025కు శ్రీకారం చుట్టిందని డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. మంగళవారం మద్దికెరలో ఉపాధి కూలీలతో యోగా శిక్షణ ఇచ్చారు. ప్రతి రోజూ యోగా తప్పక చేయాలన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఉంటుందని ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు

రహరాళ్లు..!



రాళ్లతో దర్శనమిస్తున్న రహదారి

మద్దికెర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి, కొత్తపల్లి రహదారి కనీసం నడిచేందుకు వీలు లేకుండా ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హంప నుంచి బొమ్మనపల్లి, కొత్తపల్లికి 12 కిలోమీటర్ల మేర రోడ్డును వేశారు. అనంతరం పట్టించుకోకపోవడంతో గుంతలు పడి, రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో సచివాలయానికి వెళ్లాలంటే మద్దికెరకు వచ్చి మద్దికెర నుంచి హంపకు వెళ్లాలంటే 20 కి.మీ.ల మేర దూరం పెరుగుతుందని, నూతన రహదారి నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కుంటదారి



మోడల్ స్కూల్ ముందు నిలిచిన వర్షపునీరు

ఆలూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీరాజ్ కార్యాలయం నుంచి మఠ్రిస్వామి మఠం రహదరిపై వర్షపు నీరు నిలిచి పట్టణవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ లేకపోవడంతో ఇలా తయారైంది. మోడల్ స్కూల్ వద్ద కూడా ఇదే పరిస్థితిని ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సంక్షేమ హాస్టల్లో మెరుగైన సౌకర్యాలు

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి
- మరమ్మతులు చేసిన హాస్టల్ ప్రారంభం



హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అగ్రికల్చర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ హాస్టల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం మరమ్మతులు చేసిన బాలికల కళాశాల హాస్టల్, బాలుర కళాశాల హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వం హాస్టళ్లను పట్టించుకోక విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉండదన్నారు. ఉందన్నారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడంతో సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. బాలికల కళాశాల హాస్టల్ పనులకు రు.31.94 లక్షలు, బాలుర హాస్టల్ మరమ్మతులకు రూ.36.35లక్షలు కేటాయిం చామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను సుగ్గికి తీసుకెళ్ల కుండా హాస్టళ్లలో ఉంచి చదివించాలని కోరారు. నియోజకవర్గంలో మరో నాలుగు రెసిడెన్షి యల్ పాఠశాలల ఏర్పాటురే ప్రతిపాదనలు పంపామని, అనుమతి రాగానే పూర్తిచేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఛైర్‌పర్సన్ లేకేశ్వరి, ఏఎస్‌డబ్ల్యూవో బాబు, వార్డెన్లు నాగమద్దయ్య, సిద్ధప్ప, సుజాత బీజేపీ నాయకులు వెల్లాల మదు సూదన్ శర్మ, కౌన్సిలర్ చిన్న, ఉపేంద్ర కాంట్రాక్టర్ గిడ్డయ్య పాల్గొన్నారు.

'కార్మికులపై ప్రభుత్వ నిర్లక్ష్యం'



నినాదాలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పీరా, కార్యదర్శి సోమన్న ఆరోపించారు. పట్టణంలోని కోట్ల కూడలిలో కార్మికుల రిలే దీక్షలు మంగళవారానికి 13 రోజులకు చేరాయి. చాలీచాలని వేతనాలతో దశాబ్దాలుగా పనిచేస్తున్నా, తమను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. టెక్నికల్ కార్మికులకు రూ.29500, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10ఏళ్లపై బడి పనిచేసిన కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. సోమన్న, కైలాస్, భరత్, హమీదు, రామంజి, కరెప్ప కూర్చున్నారు.

ఆర్థిక సాయం

వెల్దుర్తి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన స్వచ్ఛభారత్ కార్మికుడు కర్రెన్న(70) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ లక్ష్మీదేవి, గ్రామ నాయకుడు నివాళి అర్పించి, అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యదర్శి కృష్ణ వేణి పాల్గొన్నారు.

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం



విద్యార్థినితో మాట్లాడుతున్న ఎంఈవో ఇందిర

వెల్దుర్తి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రభుత్వం సన్నబియ్యంతో భోజనాన్ని వడ్డిస్తుందని ఎంఈవో ఇందిర అన్నారు. మంగళవారం ఆమె బొమ్మిరెడ్డి పల్లె ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పంపిణీ చేసిన సర్వేపల్లి విద్యామిత్ర కిట్లను పరిశీలించారు.

టీబీని నిర్లక్ష్యం చేయొద్దు



అవగాహన కల్పిస్తున్న క్షయ నిర్మూలన అధికారి స్వరూప్

ఆదోని రూరల్, జూన్ 17 ఆంధ్రజ్యోతి): టీబీని నిర్లక్ష్యం చేయవద్దని క్షయ నిర్మూలన అధికారి స్వరూప్ కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని జాలిమంచి సచివాలయ పరిధిలో సమావేశం నిర్వహించారు. దగ్గు, జ్వరం ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని బాధితులకు ప్రభుత్వం ఉచితంగా మందులు ఇస్తుందన్నారు. టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్, గోవిందరాజులు పాల్గొన్నారు.

పండ్ల తోటలను ప్రోత్సహించండి

తుగ్గలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని ఏపీవో హేమసుందర్ సూచించారు. మంగళవారం ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పండ్ల తోటలకు వంద శాతం సబ్సిడీ ఇస్తున్నాయన్నారు. ఈ నెల చివరినాటికి 200 ఎకరాల్లో తోటలు పెంచేలా చూడాలన్నారు. దరఖాస్తు చేసిన ప్రతి రైతుకు వెంటనే మొక్కలు తెప్పిస్తామన్నారు. ఈసీ రాజశేఖర్, టీఏలు ప్రదీప్, రామకృష్ణ, చంద్ర, జయరాం ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మద్దికెర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ అధికారి సూర్యకుమార్ అన్నారు. మంగళవారం సచివాలయంలో గర్భిణులను ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆకుకూరలు ఎక్కువగా వాడాలని, ప్రసవ సమయంలో వైద్యశాలకు రావాలన్నారు. ప్రతి గురువారం వైద్యశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని, వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా ఇస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

పత్తికొండ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అధిక సంఖ్యలో విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యేలా కృషి చేసిన మండలంలోని వందికోన గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నాగరాజును విద్యార్థులు, తల్లిదండ్రులు మంగళవారం సన్మానించారు. సీఐ జయన్న, ఎంఈవో రమేష్, హెడ్‌ఎం సుధాకర్, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ నాగవేణి ఆధ్వర్యంలో ఈ సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో గ్రామానికి చెందిన విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో 22 మంది ఎంపికయ్యారన్నారు. ఒకే గ్రామం నుంచి ఇంతమంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికవ్వడం హర్షణీయమన్నారు. విశ్రాంత హెచ్‌ఎం కుంపటి నారాయణ, గ్రామ పెద్దలు చెన్నమ నాయుడు, మల్లికార్జున, ఫక్కీరప్ప, పెద్దయ్య, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి విష ప్రచారం తగదు

- అసెంబ్లీకి వెళ్లకుండానే జీతభత్యాలు తీసుకుంటున్న ఎమ్మెల్యే విరుపాక్షి
- హామీ నిలబెట్టుకున్న టీడీపీ ప్రభుత్వం : టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంపై వైసీపీ నాయకుల విష ప్రచారం తగదని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరిట రూ.5వేల కోట్లు ఇస్తే టీడీపీ ప్రభుత్వం రూ.10వేల కోట్లు ఇచ్చిందన్నారు. విద్యారంగ గౌరవం పెంచేలా మంత్రి లోకేష్ కృషి అభినందనీయమన్నారు. ఇంత చేస్తున్నా ప్రభుత్వంపై బురదజల్లడం జగన్‌కు తగదన్నారు. ఎమ్మెల్యే విరుపాక్షి జీతభత్యాలు ఎలా తీసుకుంటు న్నారని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమం టీడీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఏబీసీ డీసీ ఛైర్మన్ నగరడోణ కిష్టప్ప, సాలిసాహెబ్, తిమ్మయ్య, మేకల రంగనాథ్, సర్పంచ్‌లు భాస్కర్, మల్లికార్జున, కిట్టు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు టీడీపీ ధ్యేయం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణస్వామి యాదవ్, బీసీ సెల్ అధ్యక్షుడు సంగాల కృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని జొన్నగిరిలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. జగన్ నిబంధనలు పెట్టి బటన్ నొక్కారని, టీడీపీ ప్రభుత్వం పాలనపై వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదన్నారు. రాబోవు రోజుల్లో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సుతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోటల్ మల్లి, జయరాం, నాగరాజ్, తదితరులు ఉన్నారు.

పనిచేసే వారికే పదవులు



మాట్లాడుతున్న పరిశీలకుడు మీనాక్షి నాయుడు

చిప్పగిరి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికసం పనిచేసే వారికే పదవులు లభిస్తాయని టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు మీనాక్షి నాయుడు అన్నారు. మంగళవారం కర్నూలు 33వ వార్డులో మంత్రి టీజీ భరత్ సమక్షంలో సమీక్ష నిర్వహించారు. పార్టీలో అందరికీ ప్రాధాన్యం ఉంటుటందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రెగ్యులర్ అబ్జర్వర్ శ్రీనివాస్ మూర్తి, ఎలక్షన్ అబ్జర్వర్ పురుషోత్తం రెడ్డి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం

ఆదోని రూరల్, జూన్ 17 ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం చేస్తుందని ఆ పార్టీ నాయకులు అజయ్‌బాబు, కల్లుబావి రాజు పేర్కొన్నారు. మంగళవారం బైచిగేరిలో జెండాను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకొందని, నాటి నుంచి నేటివరకు ప్రజల పక్షాన నిలబడిందన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రైతన్నా జాగ్రత్త!



ఆలూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ మొదలవడంతో రైతులు దుక్కి దున్ని పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. పనిలో ఉండే రైతులు చుట్కుపక్కల గమనించకుండా వెళుతుండటంతో విష సర్పాల కాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. పొలాల్లో జూన్ నుంచి నవంబరు వరకు విష సర్పాల బెడద ఎక్కువగా ఉంటుంది. రైతులు అప్రమత్తంగా ఉండి కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వాటి బారిన పడకుండా చూసుకోవచ్చు.

ఒకవేళ పాముకాటుకు గురయితే..

పాము కరచిన సమయంలో ఆందోళన చెందవద్దు. చాలామంది ఆందోళనతోనే ప్రాణం మీదకు తెచ్చుకుంటారని వైద్యులు అంటున్నారు. పాము కరచిన వ్యక్తికి ఇంట్లో వారు ధైర్యం చెప్పాలి. పాముకాటు వేయగానే కొందరు గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతో పాటు విషయం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు. అలా చేయకూడదు. వెంటనే సమీప ఆసుపత్రిలో సంప్రదించండి.

పాముకాటు లక్షణాలు..

- పాము కటువేసిన ప్రదేశంలో రెండు కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు అనిపిస్తాయి.
- కళ్లు మగతగా శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

కట్లపాము లక్షణాలు...

- కాటేసిన క్షణాల్లోనే విషం రక్తకణాల్లో కలుస్తుంది. వెంటనే ఆసుపత్రిలో చేర్పించాలి.

నాగుపాము లక్షణాలు

- కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది.

రక్తపింజరి లక్షణాలు....

- ఇది కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి ఎక్కుతుంది.

జెర్రిపోతు, నీరుకట్ట కాటు వేసినా విషం ఉండదు. చికిత్స చేయించుకోవాలి.

ఈ జాగ్రత్తలు పాటించండి

పొలం గట్ల మీద వెళ్లే సమయంలో కర్రతో శబ్దం చేస్తూ నడవాలి. రాత్రిళ్లు పొలాలకు నీరు కట్టడానికి వెళ్లిన సమయంలో టార్చ్‌లైట్ తీసుకుని వెళ్లాలి. ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

- పొలాల్లో విష సర్పాలు కాటేసే ప్రమాదం
- చిన్న జాగ్రత్తలు తీసుకుంటే క్షేమం

అందుబాటులో ఇంజెక్షన్లు



పాము కాటు బాధితుల కోసం ప్రభుత్వాసుపత్రిలో యాంటీ స్నేక్ వీనం ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాముకాటుకు గురైన వ్యక్తిని నడిపించకూడదు. పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ఉండాలి. గాయంపై భాగాన్ని వస్త్రంతో గట్టిగా లాగి కట్టి ఉంచాలి. ప్రథమ చికిత్స చేసి గాయాన్ని బట్టి రెండుసార్లు ఇంజెక్షన్ వేసుకుంటే ప్రమాదం ఉండదు.- **డా.వహీద్, వైద్యుడు, ప్రభుత్వ ఆసుపత్రి, ఆలూరు**

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి ఏమీ చేయలేదు



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

కౌతాళం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఎమ్మెల్యేగా నాలుగుసార్లు బాలనాగిరెడ్డి గెలిచినా నియోజకవర్గ అభివృద్ధికి ఏమీ చేయలేదని తెలుగుదేశం పార్టీ తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని తట్టుకోలేక ప్రతిపక్షహోదా కోల్పోయిన వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ టిప్పుసుల్తాన్, మాజీ ఎంపీటీసీ సౌద్రి బసవరాజు, సతీష్ నాయుడు, సుబ్రమణ్యం, రాజు, వీరేష్, రామలింగ, రాజానందు, గిరి, రామచంద్ర, లింగేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీలు నిర్మించాలి



ఎస్సీ కాలనీలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కౌతాళం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కరణి గ్రామం ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు మల్లయ్య, ఈరన్న కోరారు. మంగళవారం సీపీఎం బృందం గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన కాలనీల్లో సీసీ రోడ్లు వేసి దళిత కాలనీల్లో మాత్రం ఎటువంటి సీసీ రోడ్లుగానీ, డ్రైనేజీ కాలువలను గానీ నిర్మించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని పార్టీలు ఎన్నికల సమయంలో దళితుల ఓట్లు కోసం వాగ్దానాలు ఇచ్చి గెలిచిన తరువాత దళితుల సమస్యలను పట్టించుకోక దళితుల పట్ల అంటరానితన్నాన్ని చూపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఈరన్న, చిన్న మారయ్య, నాగరాజు, శివయ్య పాల్గొన్నారు.

మంత్రాలయం తహసీల్దారుగా రమాదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న కాలింగిరి రమాదేవి

మంత్రాలయం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నూతన తహసీల్దారుగా కాలింగిరి రమాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్.రవి తుగ్గలి మండలానికి బదిలీ అయ్యారు. తుగ్గలిలో పనిచేస్తున్న రమాదేవి మంత్రాలయానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడుతూ భూముల రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. భూసమస్యలపై రైతులు ఎదురొంటున్న సమస్యలపై చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమాదేవికి డీటీ జీకే గురురాజురావు, జయరామిరెడ్డి, ఆర్ఐ జనార్దన్‌రావు, భీమన్నగౌడు, శ్వేత, ఆనంద్, ప్రభాకర్, భీమయ్య, నూర్‌అహమ్మద్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

42వ రోజుకు చేరుకున్న సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు .రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 42వ రోజు సమ్మె కొనసాగించారు.. కార్యాలయం ఎదుట కూర్చోని నినాదాలు చేస్తూ తమ నిరసన తెలిపారు. మంగళవారం అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడి రాష్ట్ర కమిటీతో చర్చలు జరపాలని అన్నారు. కార్యక్రమంలో వెంకటేశులు, నరసింహులు, కేసన్న,రాజేంద్ర,నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు,పంపాపతి, సాయి, విజయ్, బాషా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో అభివృద్ధి పనులు

● నాడు రోడ్లు లేని దుస్థితి ● నేడు కళకళలాడుతున్న రహదారులు ● ఏడాది పాలనపై గ్రామస్థుల హర్షం



మాధవరంలో ఏడాది క్రితం నాటి రోడ్డు ఇలా...



మాధవరంలో నేడు పూర్తయిన రోడ్డు

మంత్రాలయం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో దాదాపు రూ.15 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులు దాదాపు ముగింపు దశకు వచ్చాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క రోడ్డు కూడా వేయకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఇది గమనించిన కూటమి ప్రభుత్వం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లె పండుగల పేరుతో మంత్రాలయం నియోజకవర్గంలో మొదటి విడతగా రూ.10 కోట్లు, రెండో విడతగా రూ.4.95 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టారు. దీంతో ప్రజలు తమ ఇళ్ల ముందు సీసీరోడ్లు ఏర్పాటు కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో గుంతలు, మురుగు కాలువలతో నిండిన రోడ్లతో నడవలేకపోయోవాళ్లమని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్లు వేయించి ప్రజలకు అండగా నిలిచిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కల్లుదేవకుంటలో నాడు రోడ్డు ఇలా



కల్లుదేవకుంటలో నేడు సీసీ రోడ్డు

మంచాలమ్మకు విశేషాభిషేకం



సుందరంగా అలంకరించిన దృశ్యం

మంత్రాలయం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో వెలసిన గ్రామ దేవత మంచాలమ్మ దేవతకు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతులమీదుగా సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. మంగళవారం జ్యేష్ఠ మాస షష్ఠి శుభ దినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం చేసి పసుపు,గందం,నిమ్మకాయలు, పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.

అవగాహన కల్పించాలి: జడ్పీ సీఈవో

నందవరం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని జిల్లాపరిషత్ సీఈవో నాసరరెడ్డి తెలిపారు. మంగళవారం నందవరం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ నెల 21న జరిగే యోగా కార్యక్రమంపై చేపడుతున్న కార్యక్రమాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి ఒక్కరికి యోగా దినచర్యలో బాగం కావాలని అది ప్రజలకు నేరుగా వివరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమం ప్రజలకు చేరువయ్యేందుకు ఏఏ కార్యక్రమాలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు.

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్రను విజయవంతం చేయాలని ఎంపీడీవో నూర్జహాన్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకట్రాముడు, పంచాయతీ రాజ్ ఏఈఈ మల్లయ్య, ఎంఈవోలు ఫైనుద్దీన్, రాగన్నల ఆధ్వర్యంలో ఆదోని సబ్ డివిజన్ నుంచి మంత్రాలయం వచ్చే ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆయా మండల శాఖల అధికారులు, యోగాకు హాజరయ్యే ప్రతి ఒక్కరికి ఆహ్లాదకరమైన వాతావరణం, మ్యాట్లు, టీషర్టులు, తాగునీరు సిద్ధంగా ఉంచేందుకు ఒక్కొక్కరికి విధులు అప్పగించారు. రాఘవేంద్ర స్వామి మఠం ముఖద్వారం ముందు యోగీంద్ర కళ్యాణమండపంలో ఈ నెల 18న బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి యోగాంధ్రను ప్రారంభిస్తారని తెలిపారు.

విద్యార్థులకు పథకాలు హర్షణీయం



చిన్నమరివీడులో పిల్లలకు కిట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గోనెగండ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థుల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలు హర్షణీయం అని పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ నరసింహులు, హెచ్ఎం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం చిన్నమరివీడు గ్రామంలో పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం విడుదల చేసిన విద్యాకిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత పుస్తకాలు, దుస్తులు, భోజనపథకానికి సరఫరా అవుతున్న సన్నబియ్యం, విశాలమైన టీవీ, గదుల గురించి వారు విద్యార్థులకు వివరించారు. అలాగే తల్లికి వందనం గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వివరించారు.

కోసిగి: కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా పథకం కిట్లు అందించడం హర్షించదగ్గ విషయమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి అన్నారు. మంగళవారం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నరసింహులు, విద్యాకమిటీ ఛైర్మన్ బాషా ఆధ్వర్యంలో పుస్తకాలు, స్కూల్ బ్యాగ్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



కోసిగిలో కిట్లను అందజేస్తున్న ముత్తురెడ్డి తదితరులు

యువకులకు అభినందనలు

కోసిగి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చిన్నభోంపల్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామంలో నిర్వహించిన పరుగు పందెం లాంగ్ జంప్‌లో గెలుపొందిన కొలిమి వీరేష్, మాధవరం బుల్లబాయి, కౌతాళం నరసింహులు విజేతలను కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి, గ్రామ పెద్దలు పూలమాలలు, శాలువలతో సత్కరించి అభినందించారు. తుంగభద్ర నది తీరం నుంచి చిన్నభోంపల్లి గ్రామం వరకు జరిగిన పరుగు పందెం పోటీలో కొలిమి వీరేష్ మొదటి విజేతగా నిలిచాడు. గ్రామానికి చెందిన మాధవరం బుల్లబ్బాయి వెండి కడియాన్ని వీరేష్‌కు బహుమతిగా అందజేశారు. అనంతరం ఎస్ఐ హనుమంతరెడ్డిని గ్రామస్థులు శాలువతో సత్కరించారు.

ఎమ్మిగనూరు ఏఓగా శివశంకర్



కడివెళ్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శివశంకర్

ఎమ్మిగనూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ అధికారిగా శివశంకర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎమ్మిగనూరులో ఏఓగా పనిచేస్తున్న మహేశ్వర రెడ్డి బదిలీపై మిడుతూరు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆలూరు నియోజకవర్గం హాలహర్వి ఏఓగా పనిచేస్తున్న శివశంకర్‌ను ఎమ్మిగనూరుకు బదిలీ చేశారు. ఏఓను కార్యాలయ సిబ్బంది, సచివాలయం వ్యవసాయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

క్రాప్‌కల్టివేషన్ రేట్స్ కార్డులను రైతులు తీసుకోవాలి : రైతులు తప్పనిసరిగా క్రాప్ కల్టివేషన్ రేట్స్ కార్డులను తప్పని సరిగా తీసుకోవాలని ఏఓ శివశంకర్ కోరారు. మంగళవారం మండలంలోని కడివెళ్ల గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామసమీపంలోని పత్తిపొలాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతు సేవాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీఏ ఖాద్రీ, ఏఓ శివశంకర్ మాట్లాడుతూ రైతులు క్రాప్ కల్టివేషన్ రేట్స్ కార్డులను తీసుకున్నట్లైతే పంట నమోదు చేయటంతో పాటు విత్తనాలు, ఎరువులు, ఆకాల వర్షంతో పంటలు దెబ్బతింటే పంట నష్టపరిహారం, పంటల బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగస్వామి, ఏఈఓ నరసింహ, వినోద్, రసూల్, సోమన్న, శ్రీనిధి, పాల్గొన్నారు.

రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం



స్వర్ణపల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో స్వర్ణ పల్లకోత్సవం రమణీయంగా నిర్వహించారు .రాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం షష్టి శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణాలు మంగళవాయిద్యాల మధ్య శ్రీమఠం ప్రాంగణం చుట్టూ విహరిస్తున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు రావడంతో మంత్రాలయం కిక్కిరిసిపోయింది.

తల్లికి వందనంతో

పేదల ఇంట వెలుగులు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల జగన్ పాలనలో 42 లక్షల మంది విద్యార్థులకు అమ్మఒడి ఇచ్చారని, అదే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం 67.27 లక్షల మంది విద్యార్థులకు వర్తింపజేసి పేదల ఇంట వెలుగులు నింపిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ అన్నారు. మంగళవారం మాధవరంలోని నివాసంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లల సంక్షేమం, విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తుందన్నారు. వైసీపీ నాయకులు తప్పుడు ప్రకటనలు చేస్తూ రూ.2వేలు మంత్రి నారా లోకేశ్‌కు వెళ్లాయంటూ తప్పుడు ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. ఏడాది పాలనలో చేస్తున్న అభివృద్ధిని చూడలేక బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు వైసీపీ నాయకుల మాటలు నమ్మే ప్రసక్తే లేదని, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మేలు చేసేలా కుటుంబంలో ఎంత మంది చదువుకుంటే అందరికి రూ.13వేల ప్రకారం ఖాతాలో జమ చేసిందన్నారు. టీడీపీ రాష్ట్ర రైతు నాయకులు ఎస్ఎం గోపాల్‌రెడ్డి, వీరేష్‌గౌడు, రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి



న్యూఎస్సీ కాలనీలో ఉన్న మట్టి రోడ్డు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని ప్రగతిశీల యువజన సంఘం కన్వీనర్ మునెప్ప డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మునెప్ప మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్డు లేక వర్షపు నీటితో గుంతల మయంగా మారిందన్నారు. మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రధానంగా సీసీ రోడ్ల నిర్మాణం లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకే ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం తక్షణమే వంకకు ప్రహరీ గోడ నిర్మించి వంక మురుగునీరు కాలనీలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలో సీసీ రోడ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు.

వెన్నుపోటు పొడవడం టీడీపీకి అలవాటే : వైసీపీ



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

గోనెగండ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, నమ్ముకున్న నాయకులకు వెన్నుపోటు పొడవడం చంద్రబాబునాయుడికి ఆ పార్టీ నాయకులకే చెల్లుతుందని మాజీ ఎంపీపీ వైసీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, తాలుకా బీసీ సెల్ అధ్యక్షుడు మురళీనాయుడు, ఇమ్రాన్‌న వాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో వెన్నుపోటు పేరుతో ప్రభుత్వ వైఫల్యాలను పేర్కొంటు వైసీపీ ప్రచురించిన పుస్తకాన్ని వారు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని హత్యలు అత్యాచారాలు, అరాచకాలు ఏడాది కాలంలో పెరిగిపోయాయని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ మన్సూర్, దొరబాబు, ఉల్చాల రంగన్ననాయుడు, చికెన్‌రాజా, మాబువలి, నద్దిముల్లా, కమల్ బాషా, ఉస్మాన్, మునెప్ప పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : అనాథ శవానికి పూలే అంబేడ్కర్ సొసైటీ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు పట్టణంలోని శ్రీనివాస థియేటర్ ఎదురుగా కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కన జూన్ 16వ తేది సాయంత్రం 45 సంవత్సరాల వయస్సు మధ్య గల వ్యక్తి పడి ఉన్నాడని అక్కడి ప్రజలు 100 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పట్టణ పోలీసులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహన్ని మార్చురీ బాడి ఫ్రీజర్‌లో ఉంచి పోలీసుల కేసు నమోదు చేసి వివరాల కోసం ప్రయత్నించగా అనాథ మృతదేహం అని మంగళవారం పూలే అంబేడ్కర్ సొసైటీ వ్యవస్థాపకుడు నరసన్నకు తెలుపగా.. సొసైటీ సభ్యులు కమల గణేష్ పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యాకోబు కలసి అనాథ శవానికి అంత్యక్రియలు చేశారు.

వీరు మారరు.. మా సమస్యలు తీర్చరు

● సచివాలయ ఉద్యోగుల తీరుతో ప్రజల అసంతృప్తి ● సమయపాలన పాటించని ఉద్యోగులు



ఉదయం 11.30 గంటలైనా తెరుచుకోని కోసిగి సచివాలయం



సిబ్బందిపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

కోసిగి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలంలో సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ కరువవడంతో ఉద్యోగుల తీరు ఇష్టానురాజ్యంగా తయారైంది. ముఖ్యంగా కోసిగి మేజర్ 5 సచివాలయాల ఉద్యోగులు సమయ పాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తాము వచ్చిన సమయమే ప్రభుత్వం కేటాయించిన సమయం మాదిరిగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కోసిగి సచివాలయం-2లో 11.30 గంటలైనా సచివాలయం తెరవకపోవడంతో లబ్ధిదారులు ఉద్యోగుల కోసం పడిగాపులు కాచారు. తల్లికి వందనం పథకం విషయమై డబ్బులు పడని వారు రేషన్ కార్డుల కోసం వచ్చిన వారు సుమారు 50 మందికి పైగా గ్రామస్థులు అధికారుల రాక కోసం ఎదురు చూశారు. ముఖ్యంగా సచివాలయాలను పర్యవేక్షించాల్సిన ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ, మేజర్ పంచాయతీ కార్యదర్శులు తమకేమీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అడిగే వారు లేక సచివాలయ ఉద్యోగుల తీరుతో కోసిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంత్రాలయం: మండలంలోని వగరూరు గ్రామంలోని సచివాలయంలో మంగళవారం 11.30 గంటలైనా ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడంపై గ్రామస్థులు తీవ్రంగా మండిపడుతున్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటలైనా కార్యాలయానికి రాకపోవడంతో గ్రామస్థులు తలుపులు వేసే ప్రయత్నం చేశారు. అంతలోనే మహాలక్ష్మి అనే ఉద్యోగి రావడంతో ఆమెను గ్రామస్థులు నిలదీశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తల్లికి వందనం పథకం డబ్బులు రాలేదని వాపోయారు. అయితే విద్య సంక్షేమ అధికారి లక్ష్మణ్‌కు తెలియజేయాలని ఈ తల్లికి వందనం పథకం లక్ష్మణ్ సరి చూస్తారని సమాధానం చెప్పారు. అయితే ఉద్యోగి లక్ష్మణ్ 12 గంటలైనా రాకపోవడంతో గ్రామస్థులు తికమకపడ్డారు. ఎంపీడీవో నూర్జహాన్‌కు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేశారు సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు దరఖాస్తు చేసేందుకు వచ్చిన గ్రామస్తులు అధికారులు లేకపోవడంతో ఇంటిదారి పట్టారు. వగరూరుతో పాటు అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉందని ఉన్నతాధికారులు సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

గోనెగండ్ల:

విధులకు సక్రమంగా హాజరుకాని వెల్ఫేర్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలని చిన్నమరివీడు గ్రామానికి చెందిన లేపాక్షినాయుడు, మురళి, ఉసేన్ డిమాండ్ చేశారు. గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంగా పనిచేస్తున్న అశ్విని విధులకు సక్రమంగా హాజరుకావడంలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రేషన్‌కార్డులలో మార్పులు చేర్పులు, కొత్తరేషన్ కార్డు మంజూరు అవకాశాలు కల్పించిందన్నారు. గ్రామంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ విధులకు రాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా విధులకు హాజరుకాలేదని పనుల నిమిత్తం వచ్చినవారు వెనుతిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.